మీలాంటివారికి ఎలాంటి నియమాలూ నిబంధనలూ వర్తించవు. నిండా నూరేళ్లూ ఇక్కడ హాయిగా, ఆనందంగా ప్రశాంతమైన జీవితాన్ని అనుభవించండి. మేమంతా మీకు ఆసరాగా వుంటాం" అంటూ కుర్చీలోంచి లేచి కామేశ్వరరావు చేతులు పట్టుకుని నమస్కరించాడు ఆ వృద్ధాశ్రమ నిర్వాహకుడు.

-బి.శ్రీనివాసరావు(హైదరాబాద్)

OOO

# ఆత్మహత్య

ఆ ఎత్తయిన కొండ మీద నుంచి కిందికి చూశాడు ఆనంద్.


'అక్కడ్నుంచి దూకితే తను చావడం గ్యారంటీ' అని మనసులో అనుకుని దూకబోయాడు. మరుక్షణం ఎవరిదో ఒక చెయ్యి ఆనంద్ భుజం మీద పడింది. వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ అరవై సంవత్సరాల వయస్సు వున్న ఓ పెద్దాయన వున్నాడు.

"ఏంటి నువ్వు చేస్తున్న పాడు పని. ఎవరు నువ్వు? ఏం కష్టమొచ్చిందని ఈ దారుణానికి పూనుకున్నావ్?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు. కానీ ఆనంద్ చెప్పే సమాధానం కోసం చూడకుండా తనే మళ్ళీ మట్లాడటం మొదలుపెట్టాడా పెద్దాయన.

"నువ్వు చచ్చి ఏం సాధిస్తావ్? ఏదైనా సమస్యలొస్తే వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. ఫెయిల్యూర్స్‌కి కుంగిపోవటం వివేకవంతుల లక్షణం కాదు. అపజయాల్ని భూతద్దంలో చూసి, ఉన్నవీ లేనివీ ఊహించుకోకూడదు. అపజయాలను విజయాలకు సోపానాలుగా మలచుకునేవాడే తెలివైనవాడు" అని ఓ క్షణమాగి "చెప్పు... ఏంటి నీకొచ్చిన సమస్య?" అడిగాడు ఆ పెద్దాయన. ఆనంద్ చెప్పేలోగా మళ్ళీ తనే మాట్లాడడం మొదలుపెట్టాడు.

"గెలుపు జీవితానికి తుది మెట్టు కాదు. గెలుపు ఓటమిలతో కూడిన మన జీవితం ఒక నిరంతర ప్రయాణం. చాలామంది నీలాగే ఒకసారి ఓటమి ఎదురుకాగానే షాక్ తింటారు. 'ఇక మన పని అయిపోయింది. ఇక చేయగలిగింది ఏమీలేదు. చావు ఒక్కటే శరణ్యం' అని డీలా పడిపోతారు. ఇది కరక్ట్ కాదు. నీలాంటివాళ్ళు గుర్తించాల్సిన విషయం ఏంటంటే లక్ష్యసాధన మార్గంలో కొన్ని ఓటమిలను రుచి చూడాల్సిరావటం ఎవరికైనా సహజం, తప్పనిసరి! అందుకు మనం సిద్ధంగా వుండాలి. గెలుపు మార్గంలో ఓటమి ఒక మజిలీ లాంటిది. విరామం తీసుకోటానికి పనికివచ్చే మజిలీ అది. ఆ మజిలీకి చేరుకున్నాక జరిగినదానిని ఒకసారి పునస్సమీక్షించుకోవాలి. ఎక్కడ పొరపాటు జరిగింది, ఏ కారణం వల్ల జరిగింది, సరిదిద్దుకోటానికి మనం ఏం చెయ్యాలి అని ఆలోచించాలి. అంతేగానీ పిరికివాడిలా పారిపోయి వచ్చి ఆత్మహత్య చేసుకోకూడదు."

ఆనంద్ ఏదో చెప్పబోతుంటే అడ్డుతగిలి మళ్ళీ తనే చెప్పసాగాడు ఆ పెద్దాయన. "సమస్యలనేవి నీ ఒక్కడికే ఉన్నాయనుకుంటున్నావ్! అది చాలా పొరపాటు. నీకూ నాకూ వున్నట్లే సమస్యలనేవి ముఖేష్ అంబానీకీ వుంటాయి, అమితాబ్ బచ్చన్‌కీ, మైకేల్ జాక్సన్‌కీ, చివరికి బిల్‌గేట్స్‌కూ వుంటాయి. కాకపోతే వాళ్ల సమస్యలు వేల కోట్లల్లో వుంటే, మనలాంటి మధ్యతరగతి వాళ్ల సమస్యలు వేల రూపాయలతో ముడిపడి వుంటాయి... అంతే తేడా!



మన పుట్టుక మన ప్రమేయం లేకుండా ఎలా జరుగుతుందో, మన చావూ అంతే! అర్ధాంతరంగా దాన్ని ముగించుకునే హక్కు మనకు లేదు. చచ్చేవరకు బ్రతకాలి. ఈ ఆత్మహత్య అనేది ఏ చెట్టూ చేయదు. ఏ జంతువు చేయదు. కానీ తెలివితేటలు వున్న మనిషే ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నాడు" అని ఈ విధంగా చెబుతూనే వున్నాడు ఆ పెద్దాయన.

కాస్సేపు సైకలాజికల్‌గా చెబితే, ఇంకాసేపు ఆధ్యాత్మికంగా, కొంతసేపు ఆవేశంగా, మరికొంతసేపు సౌమ్యంగా, కన్విన్స్ చేస్తూ లాజిగ్గా ఇలా ఎన్నోవిధాలుగా దాదాపు మూడుగంటల పాటు 'ఆత్మహత్య' ఎందుకు చేసుకోకూడదో వివరించాడు ఆ పెద్దాయన. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వనందున ఓపిగ్గా వింటూ వుండిపోయాడు ఆనంద్. ఎలాగైతేనేం చివరికి అవకాశం ఇచ్చాడు.

"చెప్పు! ఇంతకీ ఏంటి నీ ప్రాబ్లం? నిన్నీ ఆత్మహత్యకు పురిగొల్పిన ఆ సమస్య ఏంటో చెప్పు... తర్వాత నాకున్న సమస్యలు, నేను పడిన కష్టాలు, నేను అనుభవించిన అవమానాలు చెబుతా! అప్పుడు నా సమస్యల ముందు నీ సమస్య ఎంత చిన్నగా వుంటుందో నువ్వే ఆశ్చర్యపోతావ్... ఏదీ, నీ సమస్య ఏంటో చెప్పు."

"మా ఆవిడ..." అని ఆనంద్ చెప్పబోయాడు.

"అర్థమైంది... ఆమె ఎవరితోనో వెళ్ళిపోయింది. ఆ అవమానం భరించలేక నువ్వీపని చేస్తున్నావ్ కదూ?"

"కాదండీ"

"ఆమె ఈమధ్య చనిపోయింది. ఆ బాధను తట్టుకోలేక..."

"అదేం కాదు సార్" మధ్యలో ఆనంద్ అడ్డు తగిలాడు.

"మరేంటో చెప్పు!" అన్నాడా పెద్దాయన ఎంతో కూరియాసిటీగా.

"మా ఆవిడ పరమ గయ్యాళి..." అని ఇంకా ఏదో చెప్పబోతుంటే 'ఆపు' అన్నట్లు చెయ్యి అడ్డుపెట్టాడా పెద్దాయన. అతి కష్టం మీద "సారీ...!" అనగలిగాడు. ఇంకేం మాట్లాడటానికీ ఆయన నోరు పెగలలేదు. మరుక్షణం, ఆ ఇద్దరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్లిపోయారు.

-మురికినాటి గాంధీ(హైదరాబాద్)